# ఇలా జరిగేను!

ఇది రెండో సంవత్సరం—

గత సంవత్సరమంతా యశోధరుడు ఆ పల్లెలోనే వుండి పార్టీ పనిచేశాడు. రాత్రింబగళ్ళు నిద్రా నీళ్లూ లేకుండా పని చేశాడు. వ్యవసాయకూలీలను గురించి బండెడు పుస్తకాలు చదివాడు. వాళ్లల్లో చైతన్య రహితంగా పడివున్న శక్తి నిగ్రహించాడు. వాళ్ళ హక్కులను తెలుసుకున్నాడు. రైతులు వాళ్ళ నేవిధంగా పీడిస్తూ వుందీ—అతని భాషలో రక్తంతాగటం— అర్థం చేసుకున్నాడు. ఇవన్నీ వాళ్ళకిచెప్పాడు.

"పనిచేసేది మీరు — ఫలితం అనుభవించేది వారు" అన్నాడు.

ఎవరా అని వ్యవసాయకూలీలు అటూ ఇటూచూశారు.

"రోజుకి గుప్పెడు మెతుకుల్లేకుండా మీరెంతకాలం ఇలా బ్రతుకుతారు?" అని ప్రశ్నించాడు. వ్యవసాయకూలీలు తమ తమ కుండలు సర్దుకున్నారు. ఆరబోసిన బెత్తల్నీ, కుప్పలు కుప్పలుగా వున్న పీతల్నీ, వేలాడకట్టివున్న చీకుల్నీ చూచుకొని గుటకలు మింగారు.

"మీ శక్తి మీకు తెలియదు. మీరు ఏకంగా ఒక్కపెట్టున లేస్తే రాజ్యాలే మీచేతుల్లోకివస్తయ్," అన్నాడుయశోధరుడు.

వాళ్ళు ఒకళ్ళ చేతులు ఒకళ్ళు చూచుకున్నారు. ఎవరి చేతులు వాళ్లు దులుపుకున్నారు.

ఈవిధంగా అతడు సంవత్సరం తంటాలుపడ్డాడు. సంవత్సరం తిరిగివచ్చేటప్పటికి అతని కృషికి ఫలితాలు గోచరించినయ్. వ్యవసాయ కూలీల్లో విప్లవచిహ్నాలు కేకెత్తినయ్. ఎక్కడ చూచినా 'కూలీ లందరు ఏకము కావలెరా' అనే కీర్తనే విన బడుతూ వుంది—ప్రతిదానికీ యశోధరుని సలహాతీసుకోవటం మొదలుపెట్టారు. క్షణక్షణానికీ పల్లె అంతా మారిపోతున్నట్లు ఊహించుకున్నాడు. తన కృషి నేటికి ఫలించింది కదా అని సంతోషించాడు యశోధరుడు ఈవేడిలోనే జయంపొందాలను కున్నాడు. వ్యవసాయకూలీలు 'సై' అన్నారు.

"పదండి పోదాం, పదండి ముందుకు, పదండితోసుక" అన్నాడు వెంకాయ. పల్లె పల్లె బిలబిలా బయల్దేరింది. పిల్లలు పెద్దలు అంతా బయల్దేరారు. షాహుకారు బసవయ్య ఇల్లు చుట్టుముట్టారు.

షాహుకారు బసవయ్య వెంకాయిదొర. ఆవూళ్ళో రైతు లందర్లోకీ డబ్బున్నవాడు. ఆ ఇంటిదగ్గరకు జేరినప్పటినుంచీ, మిగిలినవాళ్ళు కేకలు వేస్తున్నా వెంకాయి కొంచం జెరుగ్గా వుంటం మొదలుపెట్టాడు.

"తలుపు తలుపు' అని కేక వేసింది జనం.

కాని తలుపు అలాగే మూసుకొని వుంది. వ్యవసాయకూలీ లకు ఏంచెయ్యటానికీ తోచలేదు. అయిదు నిమిషాలయింది—

పది నిమిషాలయింది—పావుగంట అయింది. తలుపు అలాగే వుంది. వ్యవసాయకూలీలు ముగ్గురు నలుగురు చొప్పున ఒక్కొక్కచోటజేరి కబుర్లు చెప్పుకోవటం మొదలు పెట్టారు. యశోధరుడికి చిరాకువేసింది. ఉపన్యాసం మొదలుపెట్టాడు.

"కామ్రేడ్స్—"

ఇంతలో తలుపు తెరుచుకుంది. బసవయ్య బయటకు వచ్చాడు. అతని వేలు పట్టుకొని మూడేళ్ల కూతురొచ్చింది. భార్య అన్నపూర్ణ తలుపు పక్కనుంచి తొంగి చూస్తూవుంది.

ఉపన్యాసకుణ్ణి వొదిలి వ్యవసాయ కూలీలంతా వొక్కసారి బసవయ్యవైపుకి తిరిగారు. కూర్చున్నవాళ్ళంతా వొక్కసారి లేచి నిలబడ్డారు. తరువాత ఏం చెయ్యాలో తోచలేదు. అలాగే చూస్తూ నుంచున్నారు.

బసవయ్య మూడేళ్లకూతురు గుంపులోవున్న వెంకాయిని గుర్తుపట్టింది. సంతోషంగా "అలుగో, ఎంకు, ఎంకు, ఎంకు," అని బుల్లి చేతుల్తో చప్పట్లు కొడుతూ గంతులేసింది.

వెంకాయి సిగ్గుతో తలవంచుకొని, "మా చిన్నదొరసాని, మా చిన్నదొరసాని" అని పక్కనున్న వాళ్ళకి చెప్పాడు.

"వెంకా?" అని పిలిచాడు బసవయ్య.

వెంకాయి వులిక్కిపడ్డాడు. "ఎళ్ళరా, పెద్దదొర పిలుస్తున్నాడు," అని అంతా వెంకాయిని ముందుకు నెట్టారు.

## దేశం ఏమయ్యేటట్టు ?

"ఏరా ఎంకా బాగున్నావా?" అన్నాడు బసవయ్య. ఆ మాటలు వెంకాయి హృదయాన్ని కరిగించినయ్. ఎన్నడో విడిచిన తండ్రిని చూచినట్లు ఆనందించాడు. ముసిముసినవ్వులు నవ్వుకుంటూ నిలబడ్డాడు.

"ఎందుకురా, ఇంతమందొచ్చారు? ఏమన్నా పనుందా?" అని అడిగాడు బసవయ్య.

"ఏం లేద్దొరా," అని సణిగాడు వెంకాయి.

"సెప్పు. దొరతో సెప్పుకోరా! మనయిసేసుకోరా," అని కొంతమంది కేకలు వేశారు.

వెంకాయి, తప్పక ధైర్యం చేశాడు—"ఏంలేద్దొరా! మా కోటి కావాలి."

"ఏమిటి చెప్పు?"

"నూతన వెవత్త"

"ఏమిటీ?"

"నూతన వెవత్త దొరా"

బసవయ్య కొంచంసేపు ఆలోచించాడు. కాని అర్థం కాలేదు—"అది నాదగ్గర లేదు," అన్నాడు.

"సూడు దొరా" అని ప్రాధేయపట్టానికి రెం డడుగులు ముందుకు వేశాడు వెంకాయి.

" నా దగ్గర లేదురా, పోయి మన జమీందారు దగ్గరుం

దేమో అడుగు," అన్నాడు బసవయ్య.

"అవును. ఆయనద్దగ్గరే దొరుకుద్ది. ఆడే దొరుకుద్ది," అని మిగిలినవాళ్ళు కేకలు వేశారు. యశోధరుడు ఉక్కిరి బిక్కిరై పోయాడు. ఏం చెయ్యాలో బోధపడలేదు. ఎలా జోక్యం కలిగించుకోవాలో తెలియలేదు. జోక్యం కలిగించుకుంటే ముందీ వ్యవసాయకూలీలు వూరుకుంటారా? అనే స్థితి కొచ్చింది.

వెంకాయ మళ్ళీ బసవయ్య నడిగాడు—"ఇంకోటి దొరా!"

"ఏమిటి?"

"కూలీలంతా ఏకం కావాలి దొరా."

"ఎందుకు?"

"కావాలి దొరా!"

"ఎందుకురా, కారణం చెప్పు"

"కారణం ఏంటి దొరా! ఏకం కావాలి."

"సరే అవ్వండి."

"అదేంటి దొరా, అలా సెలవిత్తావ్?దొర సాయం లేకుండా మేం ఎట్లా ఏకం అవుతాం?"

"సరే అట్లాగే అవ్వుదురుగాని. మరి మమ్మల్నేం చెయ్యమంటావు?" అన్నాడు బసవయ్య.

"మీరా...దొరలా...దొరలా..." అంటూ నసికాడు వెంకాయి.

"నిజమేరా, దొరల్నిడిచి మనం ఎక్కడికి పోతాం?—" అన్నారు కొందరు.

"నువ్వు సెప్పింది బాగుంది దొరా!" అన్నాడు వెంకాయి.

"అందుకని మనం అంతా ఏక మవుదాం," అన్నా డొక వ్యవసాయ కూలీ.

"ఏక మవుదాం, ఏకమవుదాం" అని మిగిలిన కూలీల్లో నుంచి కేకలు. వెంకాయి సంతోషం చెప్పటానికి వీల్లేదు. అమాంతంగా బసవయ్య మూడేళ్ల కూతుర్ని ఎత్తుకొని—

"మా చిన్ని దొరసాని
మా చిట్టి దొరసాని
మా బుల్లి దొరసాని
ఏకమవుదాం
ఏకమవుదాం
ఏకమవుదాం—" అని గంతులేశాడు.

"అంతా జమీందారు మీదకు పోదాం. నూతన వెవస్త తెచ్చుకుందాం. దొరలుంటే మనకేం భయం," అనివ్యవసాయ కూలీలంతా కేకలు.

"ఇక మీ పనుల్లోకి మీరు పొండి," అన్నాడుబసవయ్య. వెంకాయి తప్ప అంతా సంతోషంగా గుసగుస లాడుకొంటూ వెళ్ళారు.

"దొరంటే పెద్దదొరని సెప్పుకోవాల్రా,"అన్నా డొకడు.

"కష్ట సుఖాలు తెలిసిన మారాజు,"అన్నాడు ఇంకొకడు.

"అడిగినయ్యన్నీ వొప్పుకున్నాడ్రా," అన్నాడు మరొకడు.

అన్నపూర్ణమ్మ అప్పుడు బయటకువచ్చి, "వెంకా! వెళ్ళే ముందు గేదెముందు ఇంత గడ్డివేసి పో! మజ్జిగ వున్నయ్, పోయించుకుపో," అంది.

"అట్లాగే దొరసానమ్మా" అని దొడ్లోకి పరుగెత్తాడు వెంకాయి.

వెంకాయిని చూచి గేదె 'బే' అని అడిలింది.

యశోధరుడు ఒక్క క్షణం తన్ను తాను నమ్మలేకుండా అలాగే నిలబడిపోయాడు. శూన్యం—శూన్యం—శూన్యం— జేబులోనుంచి అచ్చుపుస్తకం తీశాడు. గబగబా పేజీలు తిరగ వేశాడు. అప్రయత్నంగా ఈ వాక్యం అతని కంటబడింది. "ప్రజాస్వామిక విప్లవంలో వ్యవసాయ కూలీలూ రైతులూ కలిసి పోట్లాడాలి."

"ఇది ప్రజాస్వామిక విప్లవమా?" అనుకున్నాడు. అటూ ఇటూ చూశాడు. కాని అప్పటికే ఎవ్వారిదారిన వాళ్లువెళ్లారు. వ్యవసాయకూలీలు ఎవ్వరి పనుల్లోకి వాళ్ళు వెళ్ళారు. బసవయ్య భార్యనీ కూతుర్నీ తీసుకొని ఇంట్లోకివెళ్ళి తలుపు వేసుకున్నాడు.

యశోధరుడికి మిగిలింది శూన్యమే!